# దుఃఖిత ప్రణయిని

## దండమూడి మహీధర కుమార్

ఇప్పుడిప్పుడే గతాన్ని విస్మరించి మనస్సుకు కొంత శాంతిని చేకూర్చుకోవాలని యత్నిస్తున్న సమయంలో భాస్కరం ద్వారా నీవు పంపిన లేఖ చదువుకొని అమితంగా దుఃఖించాను. నాలోని సమస్త శక్తుల్నీ సమీకరించుకొని 'నిన్నటి' విషయాల్ని మరచిపోయి 'నేటి,నీ 'రేపటి'నీ ఆశావంతంగా చేసుకోవాలని సతమవుతూన్న నా అంతర్యానికి నీ లేఖ తీరని ఆఘాతాన్ని కలుగజేసింది. నాలో తెలీని బాధ ఉద్భవించి మరలమరల నా వెనుకటి రోజుల్ని గుర్తుకు తెచ్చింది. కాని లాభం? చెట్టునుంచి రాలిన పూలు మరల చెట్టుకు చేరుకోలేవు. అవి రేకులు రేకులుగా విడిపోయి ధూళిలో కలిసి పోతాయి.

కాలగర్భంలో సంవత్సరాలు నిహితమై పోయాయి. పరిస్థితులు మారిపోయాయి. నా పెళ్లి గోపితో అయింది. ఒక పాపాయికూడా జన్మించింది. ఇప్పుడు మరల నీవు 'శశీ! ఎంత అన్యాయం చేశావు నన్ను!' అని నన్ను ప్రశ్నించావు. 'ఈజీవిత కాలప్రవాహంలో ఈరీతిగానే కొట్టుకపోవాల్సిందేనా' అనికూడా రాశావు.

ఈ నీప్రశ్నలు చదువుకునే టప్పటికి నా హృదయంలో ఒక అగ్ని పర్వతం పగిలినంత పనయింది. ఒక్కసారిగా వెనుకటి స్మృతులు నాలో మెదిలి నన్ను క్రుంగదీసి నా ఆలోచనల్ని స్థంభింపజేసినాయి. నీవీ వుత్తరం రాసి వుండకపోయినా బావుండేది. ఈ ఉత్తరం రాసి నీవు నన్నుపరంగా బాధ పెట్టావు. వెనుకటి లాగా నీవు మౌనాన్ని వహించి వున్నట్లయితే మనిద్దరి మధ్యగల సంబంధం బలవత్తరమయేది.

మధూ! నేను నిన్ను అన్యాయం చేయలేదు. మనం నిర్ణయించుకున్న రీతిగా వర్తించాలని నేను శాయశక్తులా యత్నించి విఫలురాలనయ్యాను. దీనికి కారణం నేనుకాదు. పరిస్థితులు.

ఈ జీవితకాలప్రవాహంలో నీవు కర్తవ్యం తెలీనివాడుగా కొట్టుకపోవటం నాకు సుతరామూ ఇష్టంలేదు. ఇద్దరం ఒకటి-ఏక త్రాటి మీద జీవితాంతంవరకూ నడిచిందికి-నేను చివర వరకూ కోరుకుంటూనే వున్నాను. కాని...ఆఖరికి ఇలా జరిగింది. నేను వివశురాలనయ్యాను. నీ కోపానికి గురయ్యాను. నాయీవర్తనను మోసం క్రింద జమకట్టేవు! ఎందుకిలా జరిగిందో కారణాలను వివరిస్తూ నా సంపూర్ణ జీవిత చిత్రాన్ని యథాతథంగా నీ ఎదుట వుంచాను.

నీవు ఇంతకాలమూ జీవితాన్ని ఇలా గడుపుకొచ్చి ఇప్పుడు నిరాశ నిస్పృహాలతో గడపటం నాకెప్పటికీ ఇష్టంలేదు. ఎందుకు పుట్టామో ఎందుకు చచ్చామో దీనికి అర్థం తెలుసుకోకుండా 'చచ్చిపోతాను' అని అనటంలో అర్థం లేదు. పైగా నా కష్టాలకు కారకుడవుగా ఊహించుకొని 'నేనీ ప్రపంచంపై వుండలేనని రాసుకున్నావు. ఈ పంక్తులు నన్ను అత్యంత వేదనలో నిలిపేశాయి.

నీవు చూస్తుండగానే నా పెళ్ళయింది. పాపాయి కూడా జన్మించింది. గోపీ-నే వెనుక చెప్పుకున్నట్లు-నన్ను పువ్వుల్లో పెట్టి పూజించు కుంటాడు. కొంతవరకూ నేను సుఖాన్ని చవి చూచాను. అలాంటి నేను మృత్యు గహ్వరం లోకి వెళ్లాలని ఉబలాట పట్టలో ఆశ్చర్యం లేదు. ఇరవయ్ రెండు సంవత్సరాల వయస్సులో నాకింకే కోరికా లేదు. నాకు జరగవలసినవన్నీ జరిగిపోయాయి. నా విచారం నీ విషయంలోనే! నీకు జరగవలసిన విషయాలను గూర్చి చెప్పకుండా వుండలేక పోతున్నాను. ఇలా చెప్పటం నా విధి అని భావించటం చేత ఈ మాటల్ని రాస్తున్నాను.

'ఈ దుఃఖంలోనే క్రుంగి, నా వేదనలోనే కరిగి నాకు నేనే సానుభూతి వాక్యాల్ని చెప్పు కుంటూ నన్ను నేను-నిన్ను వెనుకటిలా ప్రేమిస్తూ

అంతం చేసుకుంటానని చెప్పుకునే నీమాటలు అర్థం లేనివిగా తోస్తున్నాయి.

జీవితంలో మనస్సుల్ని స్థిరం చేసుకునేందుకు పురుషుడికి స్త్రీ, స్త్రీకి పురుషుడూ ఎంతో అవసరం. అప్పుడే అతి సన్నిహితంగా, అతిమనోజ్ఞంగా స్త్రీ పురుషుల హృదయాంతరాళాల్లో నిహితమై వున్న ఒక నిగూఢ సత్యం బయల్పడి మానవ జీవితాల్ని సౌఖ్యప్రదం చేస్తుంది.

నీవు నీ జీవితాన్ని నీకున్న సహజ సంస్కారంతో, నీ వయసులోనే జీవించే ఇతరుల జీవితాలతో పోల్చిచూచుకుంటే నీలోని బలహీనతలు స్పష్టంగా నీకే తెలీగలవు. పైగా నీ వలా అవివాహితుడుగా వుంటం ప్రకృతికి విరుద్ధం. అంతా నీలాగా భీష్మించుక కూచుంటే లోకం ఏంగాను? పైగా 'జన్మ జన్మాంతరాల వరకూ దీనిని అనుసరించగల నంటూ' మరల మరల ప్రతిజ్ఞలు బూనటం చూస్తే - ఇది నీ భావావేశంలో కలిగిన పిచ్చి వూహాగా తోస్తోంది.

నిమిష నిమిషానికీ మారే వాస్తవిక జగత్తు వేపు చూడమని నాకోరిక! పరిస్థితుల ననుసరించి వ్యక్తి మారుతూవుండాలి! అలాగాక 'నాకు నేనే' అనే వేదాంతం చెప్పుకొని ఎంతకాలమిలా అర్థంలేని వాదనలోబడి భవిష్యత్తును నీ చేతులారా చెడగొట్టుకుంటావ్? ఎంత మంది నీలాగా ప్రతిజ్ఞలుబూని తమ ఈప్సితాన్ని నెరవేర్చుకున్నారో వేళ్లమీద లెక్కించి చెప్పు చూద్దాం! ఇలా అవివాహితంగావున్న వ్యక్తుల్ని అతీతులని ఎవరూ అనలేరు. పైపెచ్చు రకరకాలుగా శంకించి నిందులకు పాల్జేయటం జరుగితీరుతుంది. ఇలా నీ జీవితం ఇతరుల అర్థం లేని విమర్శలకు గురికావటం నాకెప్పుడూ ఇష్టంలేదు. గతజలసేతుబంధనంలా ఇప్పుడు ఏమనుకుంటేమాత్రం ఏముంది-గతాన్ని మరిచిపో! అని నేను పలికిన నా వెనుకటి మాటల్ని అలక్ష్యించి నట్లే అలక్ష్యించి ఆఖరికి మరల నన్నొక మోసం చేసినదానిగా ఎంచి మళ్లీ విమర్శించావు. అలాంటి నన్నే మరల ఇంకా ప్రేమిస్తున్నాననీ, ప్రేమిస్తాననీ రాసుకున్న నీ మాటలు నీలోని విరుద్ధభావ సంఘర్షణను వ్యక్తం చేస్తున్నాయి.

'గోపీతో నా వివాహమైన నాటినుంచీ 'నిన్ను సోదరి వలెనే ప్రేమిస్తున్నా'ననీ, 'నీ జీవితానందాన్ని చూచేందుకే నేను బ్రతికివున్నానేమో'ననీ- రాసుకున్న మాటలు- ఊపిరితిత్తుల నుంచి పలికేవేగాని వీటిలో ఏమాత్రమూ వాస్తవికత లేదు. నీవు నన్ను ఎలాగూ ప్రేమించవద్దు! నన్ను సాంతంగా మరిచిపో! కలలు గనే స్వాప్నిక జగత్తునుంచి వాస్తవికత ప్రపంచంలో అడుగిడి కాలం చూపించే దారిన పయనించు.

వాస్తవిక జీవితాన్ని వదిలి ఊహాజగత్తులో 'నేను ఇప్పటికేగాదు ఎప్పటికైనను అవివాహితుడనే! ఈవిధంగా వుండడం ఎవరివల్లాగాదు నావల్ల మాత్రమే!' అని రాసినమాటలు ఊహకు సంబంధించినవి మాత్రమే! 'వివాహం ఇద్దరు బలహీనులమధ్య జరిగే ఒడంబడిక అనీ, అది దుఃఖభాజనమనే, దీనివల్ల స్వేచ్ఛ అరికట్టబడుతుందనీ చెప్పేమాటలు విమర్శకు నిలబడవు.

సమష్టిగా జీవించాల్సిన వ్యక్తి ఇలా అర్థంలేని పరిధుల్ని నిర్మించుకొని ఏటి కైవారంలోనే ప్రగ్గదలచటం అవివేకమే అవుతుంది. నీపరిమిత కైవారంలో, నీ అస్తిత్వం అంతరించాక నీకు మిగిలేదేమీ లేదు.

ఏతావాతా చెప్పదలచింది: ఇప్పటికీ నీవు నన్ను అపార్థం చేసుకోవద్దు! మరల ఎప్పుడూ 'ఛీ! ఎంత మోసం చేసావ్?' అని రాయొద్దు!

నేను నిన్ను ఎప్పుడూ చూడగోరను.

కిష్టుడు తెచ్చిన మన సెక్షన్ కాలేజీ ఫోటోను గోపీ డ్రాయింగ్ రూంలో వుంచిన రెండురోజులలో దాన్ని తీసేసి కిష్టుడి ద్వారా ఇంటికి పంపించేసాను. గోపీ 'ఇలా చేసావేం?' అన్నప్పుడు నేను చిన్నపిల్లలా వెక్కి వెక్కి ఏడ్చాను.

నీ గుర్తును తెప్పించే ఏవస్తువూ నాదగ్గర వుంచుకోలేదు. ఇటీవల కిష్టుడు నన్ను తీసుకొచ్చేందుకు వచ్చాడు. పుట్టింటికి వెళ్లేందుకు ఏ ఆడపడుచు ఆతురత చెందదు? నాకుమాత్రం ఆ ఇంట్లో కాలు పెట్టగానే నువ్వే గుర్తుకొస్తావు. ఆ ఇంటిలోని ప్రతివస్తువూ నిన్ను గుర్తుకు తెచ్చి ఎందుకూ కాకుండా చేస్తుంది.

ఇలా నాహృదయం ఇంత సంఘర్షణ పడుతున్నా నేను సుఖంగా ఉన్నానని రాసుకోటం లోని అర్థం నిన్ను దుఃఖాలవేపునుంచి సుఖాల వేపుకు-కర్తవ్యం వేపుకు - మళ్ళించేందుకే!